సాక్షి నాగర్‌కర్నూల్

శనివారం । 14 । డిసెంబర్ । 2024



ఆదిశిలావాసుడి పల్లకీసేవ

ఆదిశిలాక్షేత్రంలో వెలసిన వేంకటేశ్వర స్వామి పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు.

వివరాలు 8లో ▸



పరిశోధన ఫలితాలు

శాస్త్రవేత్తలు చేసే పరిశోధన ఫలితాలు రైతులకు చేరాలని చిన్నారెడ్డి అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0 /16.0

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. రాత్రి, తెల్లవారుజామున చలి తీవ్రత పెరుగుతుంది. అప్పుడప్పుడు చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రేపు జిల్లాస్థాయి కబడ్డీ జట్ల ఎంపిక

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని **సీబీఎం కళా**శాల ఆవరణలో ఆదివారం జి**ల్లాస్థాయి జూని**యర్ బాలబాలికల కబడ్డీ జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలురు 70 కిలోల లోపు, బాలికలు 65 కిలోలలోపు ఉండి, 2005 జనవరి 12వ తేదీ తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్, పదో తరగతి మెమో, బోనాఫైడ్‌తో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 97050 85700, 77803 42434 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

17నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ మైదానం, కల్వకుర్తి పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ నెల 17నుంచి 20వ తేదీ వరకు సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌ఓ వి.సీతారాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. మొత్తం 36 క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. 17న జిల్లా కేంద్రంలో ఖోఖో, యోగా, చెస్, 18న ఫుట్‌బాల్, కరాటే, బాక్సింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కల్వకుర్తిలో అథ్లెటిక్స్, బ్యాడింటన్, కబడ్డీ పోటీలు ఉంటాయన్నారు. 19న జిల్లా కేంద్రంలో వాలీబాల్, 20న కల్వకుర్తిలో తైక్వాండో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నాగర్‌కర్నూల్ మార్కెట్ పాలకవర్గం నియామకం



రమణారావు

నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్ పాలకవర్గాన్ని నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాగర్‌కర్నూల్ మండలం పెద్దముద్దునూర్‌కు చెందిన రమణారావును మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించారు. వైస్‌చైర్మన్‌గా గోపాసు చిన్నజంగయ్య, డైరెక్టర్లుగా జిల్లెల రాజేందర్‌రెడ్డి, చెవ్వ మాధవుడు, రత్లావత్ వాల్యానాయక్, పాలెమోని వెంకటయ్య, ఎండీ నసీర్, గంధం ఉజ్వల్, గబ్బి రాజశేఖర్, బలుస శ్రీరాములు, గడ్డంపల్లి భార్గవి, అల్వాల తిరుపతయ్య, హకీం లక్ష్మీకళ, సి.సుహాసినిలను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరితో పాటు నాగర్‌కర్నూల్ పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, వ్యవసాయశాఖ ఏడీ, మున్సిపల్ చైర్మన్ సభ్యులుగా కొనసాగనున్నారు.

⇨ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తనను నియమించేందుకు సహకరించిన ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డితో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పెద్దలకు రమణారావు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని రైతుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

మద్దిమడుగు అంజన్నను దర్శించుకున్న ఎస్పీ



అమ్రాబాద్: మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామిని శుక్రవారం ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం దీక్ష విరమణ ఉత్సవాల నిర్వహణ, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పోలీసులకు సూచించారు. అంతకుముందు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎస్పీని సత్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శంకర్ నాయక్, ఏఎస్‌ఐ బాలునాయక్ పాల్గొన్నారు.

రేపు సామూహిక వ్రతాలు

కందనూలు: మార్గశిర మాస పౌర్ణమిని పురస్కరించుకొని ఈ నెల 15న జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి గందాడై వరదరాజన్ అయ్యంగార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దత్తాత్రేయ జయంతి సందర్భంగా దత్తాత్రేయ హోమం, సామూహిక అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 16 నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభమవుతాయని తెలిపారు.

సొంతింటిపై ఆశలు

జిల్లాలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



అచ్చంపేట ఒకటో వార్డులో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్న అధికారులు

- జిల్లావ్యాప్తంగా 2,33,124 దరఖాస్తులు
- ఇంటింటికెళ్లి వివరాలు సేకరిస్తున్న సర్వేయర్లు
- గ్రామ, వార్డు సభల్లో లబ్ధిదారుల ఎంపిక
- ఇందిరమ్మ కమిటీల ఆమోదంతో ఇళ్లు మంజూరు
- సొంత స్థలం ఉన్నవారికి తొలి ప్రాధాన్యం

అచ్చంపేట: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు సర్వే ప్రారంభమైంది. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లో మున్సిపల్ సిబ్బంది దరఖాస్తుదారుల ఇంటింటికెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను నమోదు చేస్తున్నారు. మహిళల పేరిట ఇళ్లను మంజూరు చేయనున్నారు. మొదటి దశలో అద్దె ఇంట్లో ఉంటూ.. సొంత స్థలం ఉన్న వారికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేతో సొంతింటి కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదల ఆశలు చిగురిస్తున్నాయి. మొదటి విడతలో ప్రతి నియోజకవర్గంలో 3,500 చొప్పున ఇళ్లు మంజూరు చేయనున్నారు. గిరిజనులు, దళితులు, వ్యవసాయ కూలీలు, దివ్యాంగులు, పారిశుద్ధ్య కార్మికులకు ముందుగా ఇళ్లు కేటాయించనున్నారు.

ప్రజాపాలన దరఖాస్తులే ప్రామాణికం..

గతేడాది డిసెంబర్ చివరి వారం నుంచి జనవరి మొదటి వారం వరకు ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించారు. వీటి ఆధారంగానే లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. జిల్లావ్యాప్తంగా 2,33,124 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వాటి ఆధారంగా సిబ్బంది ఇంటింటి సర్వే చేపడుతున్నారు. ఇళ్లతో పాటు లబ్ధిదారుడి ఫొటో తీస్తున్నారు. సొంత స్థలం ఉంటే అక్కడే లబ్ధిదారుడిని నిల్చోబెట్టి ఫొటో తీస్తున్నారు. మూడు, నాలుగు వాహనాలున్న కుటుంబాలు, వ్యవసాయ యంత్రాలు, ప్రభుత్వం ఉద్యోగులు, ఇతర పథకాల కింద గతంలో ఇంటి నిర్మాణానికి లబ్ధి పొందిన, అదాయ పన్ను చెల్లిస్తున్న వారు అనర్హులు. సర్వేలో సేకరించిన సమాచారాన్ని పక్కాగా పరిశీలించి అర్హులను ఎంపిక చేయనున్నారు.

యాప్‌లో పూర్తి వివరాలు నమోదు..

మొబైల్ యాప్‌లో దాదాపు ఏడు ప్రశ్నలుంటాయి. భూమి ఉందా? ఏం చేస్తుంటారు? మొత్తం ఎంతమంది కటుంబ సభ్యులు? వంటి వివరాలను తెలుసుకుని యాప్‌లో పొందుపరుస్తారు. ప్రభుత్వం విడుదల చేసిన ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, వివరాలను నమోదు చేసుకోవచ్చు. లబ్ధిదారు పేరు, ఆధార్ నంబర్, సంవత్సర ఆదాయం, సొంత స్థలం ఉందా? ఇంత వరకు ఎప్పుడైనా ఇళ్లు మంజూరైందా? అనే ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేయాలి. లబ్ధిదారుల ఫోన్‌లో చేసుకోలేకపోతే అధికారులు ఇంటికి వచ్చినప్పుడు సమాచారం తెలియజేయవచ్చు. యాప్‌లో ఏఐ టెక్నాలజీని ఉపయోగించి.. లబ్ధిదారు ఇల్లు నిర్మించుకునే స్థలానికి భౌగోళిక అక్షాంశాలు, రేఖాంశాల వివరాలు నమోదు చేస్తారు. ఇళ్ల నిర్మాణ ప్రగతి సైతం ఏఐ ఆధారంగా ఫొటోలు తీయనున్నారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా వివరాలను నమోదుచేస్తారు.

> **పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక**
>
> 
>
> ప్రతి మండల కేంద్రంలో ఇందిరమ్మ నమూనా ఇల్లు నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే స్థలాల ఎంపిక పూర్తయింది. నమూనా భవనాలకు సంబంధించి మూడు మోడళ్లు కూడా సిద్ధమయ్యాయి. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టనున్నాం. ప్రత్యేక యాప్ ద్వారా దరఖాస్తు చేసిన వారి ఇంటికి వెళ్లి పరిశీలన చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.
>
> – రాజవర్ధన్‌రెడ్డి, ఏఈ, గృహ నిర్మాణశాఖ, నాగర్‌కర్నూల్

మండల కేంద్రాల్లో నమూనా ఇల్లు..

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, మంజూరు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం.. గృహనిర్మాణ శాఖను బలోపేతం చేస్తోంది. గతంలో ఈ శాఖలో విధులు నిర్వర్తించిన అధికారులను తిరిగి సొంత గూటికి చేరుస్తున్నారు. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి ముందే ప్రభుత్వం మండల కేంద్రాల్లో నమూనా ఇంటిని నిర్మించనుంది. ఇప్పటికే ఆయా మండల పరిషత్ కార్యాయాల ఆవరణలో ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు మొదలుపెట్టారు. ప్రభుత్వం మూడు ఇళ్ల నమూనాలను రూపొందించింది. లబ్ధిదారులకు అవగాహన పెంచేందుకు గాను ఒక డిజైన్ ఆధారంగా ప్రతి మండల కేంద్రాల్లో నమూనా గృహం నిర్మించాలని ఆదేశాలు జారీ చేసింది. తక్కువ స్థలంలో రెండు గదులు, వంటగది, బాత్‌రూం, మరుగుదొడ్డి ఉండేలా ఇంజినీర్లు నమూనాలను రూపొందించారు.

గ్రామసభల్లో అర్హుల గుర్తింపు..

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సాయం అందుకునే వారు అర్హులా.. కాదా అనే విషయం గతంలో యాప్ ద్వారా తేల్చాల్సి ఉండేది. యాప్‌ను నిర్వహించేది కార్యదర్శులే కావడంతో ఎవరికైనా పథకం లబ్ధి చేకూరకపోతే తమకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయని కార్యదర్శులు స్పష్టంచేశారు. దీంతో యాప్ ద్వారా కేవలం వివరాలను నమోదు చేసి, గ్రామసభల్లో అర్హులను గుర్తించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సర్వే అనంతరం జాబితాను ఆయా గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీ వార్డుల్లో ఇందిరమ్మ కమిటీలకు అందజేస్తారు. అనంతరం గ్రామసభలో అర్హులను గుర్తిస్తారు. కమిటీ సభ్యుల జాబితాలోని పేర్లను పరిశీలించి, వారు అర్హులో కాదో నిర్ణయిస్తారు. కమిటీ ఆమోదం తర్వాతే దరఖాస్తుదారుడికి ఇల్లు మంజూరు చేస్తారు.

ప్రజాపాలన దరఖాస్తులు ఇలా..

మండలం	దరఖాస్తులు
అచ్చంపేట	13,218
అమ్రాబాద్	9,680
బల్మూర్	11,212
బిజినేపల్లి	17,847
చారకొండ	7,284
కల్వకుర్తి	10,079
కోడేరు	12,337
కొల్లాపూర్	10,247
లింగాల	10,412
నాగర్‌కర్నూల్	10,181
పదర	6,454
పెద్దకొత్తపల్లి	16,393
పెంట్లవెల్లి	6,386
తాడూరు	8,228
తెలకపల్లి	13,037
తిమ్మాజిపేట	10,299
ఉప్పునుంతల	9,559
ఊర్కొండ	6,297
వంగూరు	10,426
వెల్దండ	11,196
మున్సిపాలిటీల వారీగా..	
నాగర్‌కర్నూల్	6,940
కల్వకుర్తి	5,205
అచ్చంపేట	4,450
కొల్లాపూర్	5,757

పకడ్బందీగా గ్రూప్–2 పరీక్షలు



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లాలో 32 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 9,731 మంది అభ్యర్థులు
- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్: జిల్లాలో గ్రూప్–2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దేవ సహాయం, రీజినల్ కోఆర్డినేటర్ మధుసూదన్ శర్మ, డీఎస్పీ శ్రీనివాసులుతో కలిసి గ్రూప్–2 పరీక్షల నిర్వహణ, బయోమెట్రిక్ విధానంపై చీఫ్ సూపరింటెండెంట్లు, ఐడెంటిఫికేషన్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, లోకల్, జాయింట్ రూట్ అధికారులు, ఇన్విజిలేటర్‌లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 15న ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్ – 1, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్–2, 16వ తేదీన ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్– 3, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్ – 4 పరీక్షలు ఉంటాయని తెలిపారు. జిల్లాలో మొత్తం 9,731 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. పరీక్షల నిర్వహణకు 32 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. 16 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 16 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 16 మంది పరిశీలకులు, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్, 44 మంది బయోమెట్రిక్, 58 మంది ఐడెంటిఫికేషన్ అధికారులతో పాటు ఐదు రూట్లలో లోకల్, జాయింట్ రూట్ అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో వంద శాతం బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఓఎంఆర్ షీట్‌లో అత్యంత జాగ్రత్తగా అభ్యర్థులు తమ వివరాలను కేటాయించిన బాక్సుల్లో తప్పులు లేకుండా నమోదు చేసేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది తప్ప.. మరెవరిని కేంద్రాల్లోకి అనుమతించరాదన్నారు. పరీక్ష కేంద్రాలకు మూడు కి.మీ. పరిధిలో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. సంబంధిత అధికారులు పరీక్ష కేంద్రాలను సందర్శించి, మౌలిక వసతులు కల్పించాలన్నారు. సీసీ కెమెరాల పనితీరును సరిచూసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు సరిపడా ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష పేపర్లు, ఓఎంఆర్ షీట్లను పకడ్బందీగా ఎస్కార్ట్‌తో ప్రభుత్వ వాహనాల్లో పరీక్ష కేంద్రాలకు తరలించాలన్నారు. కేంద్రాల వద్ద 144, సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

అభ్యర్థులకు సూచనలు..

గ్రూప్–2 పరీక్షలు రాసే అభ్యర్థులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. అభ్యర్థులు టీజీపీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. హాల్‌టికెట్‌పై అభ్యర్థులు తమ తాజా ఫొటోను అతికించాలన్నారు. డౌన్‌లోడ్ చేసిన హాల్‌టికెట్‌పై ఫొటో సరిగా ముద్రించి లేకుంటే.. సదరు అభ్యర్థి గెజిటెడ్ అధికారి లేదా చివరగా చదువుకున్న విద్యాసంస్థ ప్రిన్సిపాల్ అటెస్ట్‌తో మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో పాటు వెబ్‌సైట్‌లో పొందుపరిచిన ధ్రువపత్రాన్ని పూర్తి చేసి, ఇన్విజిలేటర్‌కు అందించాల్సి ఉంటుందని తెలిపారు. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే గేట్లు మూసివేస్తామని, అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు మెహందీ, తాత్కాలిక టాటూలను వేసుకోరాదని స్పష్టం చేశారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్‌బాల్ పాయింట్ పెన్, గుర్తింపు పొందిన ప్రభుత్వ ఒరిజినల్ ఐడెంటిటీ కార్డును తప్పనిసరిగా తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే, సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన 93925 77336 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రైతన్నకు అండగా ప్రభుత్వం



రైతులకు స్ప్రింక్లర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి/కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నకు అండగా నిలుస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 181 మంది రైతులకు సబ్సిడీపై స్ప్రింక్లర్లు అందజేశారు. అనంతరం 78 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో రైతులకు సబ్సిడీపై ఎలాంటి పరికరాలను అందించకుండా ఇబ్బందులకు గురిచేశారని గుర్తుచేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. రైతుల సంక్షేమం, విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తూ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇప్పటికే రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేయడంతో పాటు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి, 20లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 7లక్షల కోట్ల అప్పు చేయగా.. ఈ ప్రభుత్వం రూ. 54వేల కోట్లను వడ్డీ రూపంలో కడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, వైస్ చైర్మన్ షాహెద్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

⇨ కల్వకుర్తి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు బాలాజీ సింగ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సంజీవ్ యాదవ్, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి, రవిగౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో శుక్రవారం ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా అయ్యప్ప మాలధారులు పాపనాశిని గుండం వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం గణపతిపూజ, శివుడికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అయ్యప్పస్వామికి సహస్ర నామార్చన, లక్ష పుష్పార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భీరం మాధవరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమ్మకు ఆయుష్షు

పాలమూరు జనరల్ ఆస్పత్రిలో మెరుగుపడుతున్న వైద్య సేవలు

- కొత్తగా ఐదు పడకల ఐసీయూ అందుబాటులోకి..
- గైనిక్ విభాగంలో కృత్రిమ శ్వాస.. మాతా మరణాలు తగ్గే అవకాశం
- పేద రోగులకు ఉపయోగపడనున్న వెంటిలేటర్ సౌకర్యం
- త్వరలో ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్న ఆస్పత్రి అధికారులు



జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేస్తున్న ఐదు పడకల ఐసీయూ కేంద్రం

'సర్కారీ వైద్యమంటే భయపడేది నిన్నటి మాట. ప్రస్తుతం ప్రైవేట్, కార్పొరేట్ తరహాలో వైద్యసేవలు మెరుగుపడేలా చర్యలు చేపట్టేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అధునాతన పరికరాలతో వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలోని గైనిక్ విభాగంలో ఐసీయూ (ఇంటెన్సివ్ కేర్ యూనిట్) ఏర్పాటు చేస్తున్నారు.'

పాలమూరు: ఉమ్మడి జిల్లాకు పెద్దదిక్కుగా మారిన జనరల్ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య నానాటికీ పెరుగుతున్నాయి. ఉమ్మడి ఐదు జిల్లాలతోపాటు వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి కొందరు గర్భిణులు ప్రసవం కోసం ఇక్కడికి వస్తుంటారు. ప్రస్తుతం ఆస్పత్రిలో నిత్యం 30 నుంచి 40 ప్రసవాలు జరుగుతున్నాయి. ఇందులో ఐదు నుంచి పది వరకు హైరిస్క్ కేసులు ఉంటున్నాయి. ఈ క్రమంలో హైరిస్క్ ఉండి సెక్షన్ అయిన తర్వాత కొన్ని కేసులకు ఐసీయూలోని వెంటిలేటర్ చికిత్స తప్పనిసరి అవుతోంది. ఇందులో శ్వాస, గుండె, రక్తపోటు తదితర అవయవాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు వీలుగా సౌకర్యాలు ఉంటాయి. 24 గంటలపాటు బాలింతలను వైద్య సిబ్బంది పర్యవేక్షిస్తారు. అప్పటికప్పుడు రోగికి ఏదైనా సమస్య ఎదురైతే సంబంధిత వైద్యులను వెంటనే పిలిపించి వైద్య సేవలందిస్తారు.

మూడు షిఫ్టులలో విధులు

జనరల్ ఆస్పత్రిలోని గైనిక్ విభాగంలో కొత్తగా ఐదు పడకలతో ఐసీయూ ఏర్పాటు చేస్తున్నారు. ఐసీయూలో మూడు షిఫ్టులలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉంటారు. స్థానికంగా ఉన్న వైద్యులతోపాటు మరి కొంతమందిని ఇతర ప్రాంతాల నుంచి పిలిపించుకోని సేవలు అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కృత్రిమ శ్వాస అవసరం ఉన్న రోగులందరినీ ఐసీయూలో అడ్మిట్ చేసి వెంటిలేటర్స్‌పై ఉంచి కృత్రిమ శ్వాస అందించడానికి ఐసీయూ ఉపయోగపడనుంది. రోగి పరిస్థితి విషమంగా ఉన్న సమయంలో కృత్రిమ శ్వాస అందించి అత్యవసర చికిత్స అందిస్తారు. కొత్తగా ఏర్పాటు కాబోతున్న ఐసీయూలో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా అత్యాధునిక పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో కేంద్రీయ పర్యవేక్షక వ్యవస్థ ఏర్పాటు చేస్తారు. మొత్తం ఐదు పడకలతోపాటు ఐదు వెంటిలేటర్లు, మల్టీ చానల్ మానిటర్లు, పల్స్ ఆక్సిమీటర్లు, సెక్షన్ పంపులు, ఎక్స్‌రే, ఈసీజీ, డీఫిబ్రిలేటర్, ఆల్ట్రాసౌండ్ కలర్ డాప్లర్, ఎలక్ట్రోలైట్ అనలైజర్, ఏబీజీ అనలైజర్ తదితర అధునాతన పరికరాలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఐసీయూకు అవసరమైన పరికరాలు, మిషన్లను ఏర్పాటు చేసి ఒక ఐసీయూ సెటప్ తయారు చేసే పనిలో ఉన్నారు. త్వరలోనే ఐసీయూ కేంద్రాన్ని ప్రారంభించనున్నారు.

ఈ ఏడాది జనరల్ ఆస్పత్రిలో అయిన ప్రసవాలు ఇలా..

సాధారణ ప్రసవాలు	ఆపరేషన్లు	మొత్తం ప్రసవాలు
3,038	4,507	7,545

❐ ఈ ప్రసవాలు అయిన వారిలో అధికంగా మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లావాసులు ఉండగా.. ఆ తర్వాత వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల వారు ఉన్నారు. అలాగే వికారాబాద్ నుంచి కూడా ఎక్కువ కేసులు వస్తున్నాయి.



జనరల్ ఆస్పత్రిలో మాతాశిశు విభాగం

> **చివరి దశలో పనులు..**
>
> 
>
> గైనిక్ విభాగంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఐదు పడకల ఐసీయూ యూనిట్ వల్ల ప్రసవమైన హైరిస్క్ కేసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అత్యవసర చికిత్స అవసరం ఉంటే థియేటర్ పక్కనే ఉండే ఐసీయూలో అడ్మిట్ చేసుకోవచ్చు. వీటి నిర్వహణ కోసం ప్రత్యేక సిబ్బందిని మూడు షిఫ్టులలో ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం చివరి దశలో పనులు నడుస్తున్నాయి. త్వరలోనే ప్రారంభిస్తాం.
>
> – సంపత్‌కుమార్‌సింగ్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్, మహబూబ్‌నగర్

క్లుప్తంగా

పాముకాటుతో రైతు మృతి


వెంకటేష్ (ఫైల్)

పాన్‌గల్: పాముకాటుతో రైతు మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిక్కేపల్లి గ్రామానికి చెందిన రైతు జలకంటి వెంకటేష్(43) తన వ్యవసాయ పొలంలో వేరుశనగ పంటకు నీటి స్ప్రింక్లర్లను మార్చుతున్న క్రమంలో పాముకాటుకు గురయ్యాడు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో చనిపోయాడు. అతని భార్య యశోద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వెంకటేష్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు.

మహిళ మృతదేహం లభ్యం

గద్వాల క్రైం: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన గురువారం రాత్రి మండలంలోని జమ్ములమ్మ రిజర్వాయర్‌లో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన కథనం మేరకు.. గద్వాల మండలంలోని జములమ్మ రిజర్వాయర్‌లో గుర్తు తెలియని మహిళ (50) మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటికి తీయగా గుర్తు పట్టలేనంతగా ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి సంబంధించిన బంధువులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

హన్వాడ: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హన్వాడ మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన ఉప్పనగంటి అంజమ్మ అలియాస్ అరుణ(27)కు గురువారం ఫిట్స్ రావడంతో మృతి చెందినట్లు భర్త, కుటుంబీకులు పేర్కొన్నారు. తన కూతురు మృతిపై అనుమానం ఉందని తల్లి నర్సమ్మ శుక్రవారం హన్వాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి బలవన్మరణం


జావేద్

తిమ్మాజిపేట: యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన జావేద్(20) గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవ పడి వెళ్లిపోయాడు. మరుసటి రోజు తన వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగి పడిపోయాడు. ఆ దారిలో వెళ్లిన వారు దీన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. జావేద్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. జావేద్‌కు తల్లి, చెల్లెలు ఉన్నారు.

వృద్ధురాలిపై దాడి: కేసు నమోదు

పాన్‌గల్: వృద్ధురాలిపై దాడి చేసిన సంఘటనలో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. మండలంలోని అన్నారంతండాకు చెందిన వృద్ధురాలు రాత్లావత్ కేస్లీతో అదే తండాకు చెందిన మూడవత్ పేరుమాళ్ ఐదేళ్ల క్రితం అవసరముండి రూ.80 వేలు అప్పుగా తీసుకున్నాడు. ఆ డబ్బులను ఆరు నెలల్లో ఇస్తామని ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశాడు. ఈనెల 10న వృద్ధురాలి ఇంటి ముందు వెళ్తున్న సమయంలో పేరుమాళ్‌ను డబ్బులు ఇవ్వాలని కోరింది. మద్యం మత్తులో ఉన్న పేరుమాళ్ వృద్ధురాలిని బూతులు తిడుతూ కిందకు తోసేసి కాళ్లు, చేతులతో ఆమెపై దాడిచేశాడు. అప్పు డబ్బులు ఇవ్వనని, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అని, చంపుతానని బెదిరించాడు. ఈ విషయంపై తండాలో గ్రామపెద్దల సమక్షంలో పంచాయితీ పెడ్తామని చెప్పినా అతను అక్కడికి రాలేదు. దీంతో పేరుమాళ్‌పై చర్యలు తీసుకోవాలని శుక్రవారం వృద్ధురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం



ఎర్రవల్లి: జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గడ్డి ట్రాక్టర్ దగ్ధమైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గద్వాల మండలంలోని గుర్రంగడ్డకు చెందిన రాజవర్ధన్‌రెడ్డి ట్రాక్టర్‌లో వరిగడ్డి వేసుకొని కలుకుంట్లకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో 44వ జాతీయ రహదారిపై పదో బెటాలియన్ పెట్రోల్‌బంక్ దగ్గరికి రాగానే ప్రమాదవశాత్తు వరిగడ్డికి నిప్పంటుకుంది. దీంతో ట్రాక్టర్‌లోని వరిగడ్డితో పాటు ట్రాలీ పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు గద్వాల ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా, ఫైరింజన్ సంఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పింది. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వరిగడ్డితో పాటు ట్రాలీ పూర్తిగా కాలిపోయిందని, దాని విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

వైభవంగా ఆదిశిలావాసుడి పల్లకీసేవ


మల్దకల్‌లో ఊరేగుతున్న ఆదిశిలావాసుడు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారిని పల్లకీలో ఊరేగించారు. వేద పండితులు రమేషాచారి, మధుసూదనాచారి, శశాంక్, రవిచారి, ధీరేంద్రదాసుల ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో హనుమద్ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డిలు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్ణ, అరవిందరావు, బాబురావు, చంద్రశేఖర్‌రావు, నాగరాజుశర్మ, వాల్మీకి పూజారులు పాల్గొన్నారు.

జాతరకు పటిష్ట బందోబస్తు

మల్దకల్ జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్లు జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు అన్నారు.


మల్దకల్‌లో జాతర ఏర్పాట్లు పరిశీలిస్తూ మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

మల్దకల్ ఆదిశిలా క్షేత్రంలో ఎస్పీ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్, ఈఓ, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ ఆలయ విశిష్టతను ఎస్పీకి వివరించి శాలువాతో సత్కరించి మెమొంటోను అందజేశారు. అనంతరం ఆలయ పరిసరాల్లో భక్తుల క్యూలైన్లు, భారీకేడ్లు, వాహనాల పార్కింగ్, దుకాణ సముదాయాలను ఎస్పీ పరిశీలించారు. అనంతరం మల్దకల్ పోలీస్ స్టేషను సందర్శించి కేసుల వివరాల రికార్డులను పరిశీలించారు. ఎస్పీ వెంట డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు శ్రీను, టాటాబాబు, ఎస్ఐలు నందికర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అంజన్న ఊరేగింపు

మక్తల్: శ్రీపడమటి అంజనేయస్వామి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం మక్తల్‌లో ఉత్తరాదిమఠం నుంచి పురవీధుల గుండా స్వామివారి పల్లకీసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 8గంటలకు అంకుర్పార్పణ, ధ్వజారోహణం, అలంకారోత్సవం ఉదయం 9గంటలకు హనుమద్ వ్రతం, అంతకుముందు ఆలయంవద్ద ధ్వజారోహణ కార్యక్రమం చేపట్టారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపు సమయంలో మహిళలు భజనలు, కోలాటం, కీర్తనాలు ఆలపించారు. సాయంత్రం 7గంటలకు గజవాహన సేవాకార్యక్రమం నిర్వహించారు. చిన్నరథంపై గజవాహనంను పెట్టి రథాన్ని లాగారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ చైర్మన్ ప్రాణేష్‌కుమార్, ఈఓ శ్యాం సుందర్‌చారి, భక్తులు పాల్గొన్నారు.


మక్తల్‌లో ఆలయంలో గజవాహన సేవ

తపాలాశాఖ పథకాలతో లాభాలు

- వనపర్తి డివిజన్ పర్యవేక్షణ అధికారి భూమన్న

తెలకపల్లి: తపాలాశాఖ పథకాలతో అనేక లాభాలు ఉన్నాయని, గ్రామాల్లో ప్రజలందరికి ఈ పథకాలు అందేలా చూడాలని వనపర్తి డివిజన్ పర్యవేక్షణాధికారి భూమన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన తెలకపల్లిలోని తపాలాకార్యాలయంలో ఆయన పర్యవేక్షించారు. తపాలాశాఖలో ఉన్నత సేవలు అందించిన ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలకపల్లి తపాలాశాఖలో ప్రజలకు ఉపయోగపడే పథకాలు ఎన్నో ఉన్నాయని, వాటిని ఉపయోగించుకొని తమ కుటుంబానికి ఆర్థిక భరోసా అందించాలన్నారు. చిన్న మొత్తాల పొదుపుతో తమ కుటుంబాలకు ఎంతో ఆర్థిక భరోసా అందించేవిధంగా పోస్టర్ రికరింగ్ డిపాజిట్లు, బాలికల కోసం సుకన్య సమృద్ధి పథకం, పీపీఎఫ్, సీనియర్ సిటిజన్, సేవింగ్‌ఖాతా తదితర పథకాలతో గ్రామీణ తపాల జీవిత బీమా పథకంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సంవత్సరానికి కేవలం రూ.520లతో రూ.10 లక్షల ప్రమాదబీమా పొందవచ్చన్నారు. సంవత్సరానికి కేవలం రూ.2200లతో రూ.15 లక్షల ఆరోగ్య బీమా పాలసీ అందుబాటులో ఉందన్నారు. ఈ పథకాలపై ప్రజలకు అవగాహన కలిపించాలని బీపీఎంలకు సూచించారు. ఇప్పటి వరకు వనపర్తి డివిజన్ పరిధిలో తపాల జీవిత బీమా పాలసీలు అత్యధికంగా చేసిన మండల పరిధిలోని గౌరెడ్డిపల్లి బీపీఎం జిలకర శంకరయ్యను, తెలకపల్లి సబ్ కార్యాలయం పరిధిలో అత్యధికంగా సేవింగ్ ఖాతాలను చేర్పించిన రాకిండ బీపీఎం ఇందిరను తపాల సూపరింటెండెంట్ భూమన్న, నాగర్‌కర్నూల్ సబ్ డివిజనల్ అధికారి సృజననాయక్‌లు శాలువా, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఓలు మహముద్‌ఖాన్, జగన్, సబ్ పోస్ట్‌మాస్టర్ ప్రవీన్‌కుమార్, ఆయా గ్రామాల బీపీఎంలు శివయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.


గౌరెడ్డిపల్లి శంకరయ్యను సన్మానిస్తున్న సూపరింటెండెంట్ భూమయ్య

ఆలయాలను దర్శించుకున్న ఏపీ డీఐజీ


ఆలయాల దర్శనానికి విచ్చేస్తున్న రాయలసీమ జైళ్ల శాఖ డీఐజీ రాజేశ్వర్‌రావు

అలంపూర్: దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్ర ఆలయాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమ జైళ్ల శాఖ డీఐజీ రాజేశ్వర్‌రావు కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు అర్చక స్వాములు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీఐజీ శ్రీ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చక స్వాములు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు వారిని శేష వస్త్రాలతో సత్కరించారు. వారితో పాటు ఆలయ అధికారులు ఉన్నారు.

విద్యామండలి చైర్మన్‌ను కలిసిన పీయూ వీసీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డిని శుక్రవారం రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల వీసీలతోపా పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు వివిధ కోర్సులకు సంబంధించి కొత్త కోర్సుల రూపకల్పన, సిలబస్ మార్పులు, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కోర్సులు, వాటిలో మార్పులు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఉపాధి ఆధారిత కోర్సులను ప్రవేశపెట్టాలనే అంశాలపై చర్చించారు.

ఆవిష్కరణలతోనే సమస్యలకు పరిష్కారం


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

- కలెక్టర్ విజయేందిర బోయి
- ఆకట్టుకుంటున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నూతన ఆవిష్కరణలతోనే మానవ జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం లభిస్తోందని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఫాతిమా విద్యాలయలంలో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఆమెను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రదర్శనలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని అన్నారు. తాగునీరు, అగ్నిప్రమాదాల నివారణ, వర్మి కంపోస్టు తయారీలో విద్యార్థుల నూతన పద్ధతులు బాగున్నాయన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పాఠశాల స్థాయిలో ప్రయోగాత్మక బోధనతో ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఈఓ ప్రవీణ్‌కుమార్, సీఎంఓ బాలుయాదవ్, ఎంఈఓ దుంకుడు శ్రీనివాస్, శంభుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు ఆస్కారం

- డీఈఓ రమేష్‌కుమార్
- ముగిసిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన


విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న డీఈఓ రమేష్‌కుమార్

కందనూలు: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలతో ఆస్కారం ఉంటుందని డీఈఓ రమేష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన శుక్రవారం ముగిసింది. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలు అందరినీ ఆకట్టుకున్నాయి. సమాచారం, పర్యావరణ హితమైన పదార్థాలు, ఆరోగ్యం, పరిశుభ్రత, రవాణా, గణితం తదితర అంశాలపై విద్యార్థులు ప్రాజెక్టులు తయారు చేశారు. జిల్లాలోని పలు పాఠశాలల నుంచి 512పైన నమూనాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలను డీఈఓ సందర్శించి మాట్లాడారు. చదువుతో పాటు నూతన ఆవిష్కరణలు చేయడంతో ఎందరో శాస్త్రవేత్తలు పుట్టుకు వస్తారని అన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ ప్రదర్శనను 10000 మంది విద్యార్థులు తిలకించినట్లు తెలిపారు. ఈ నెల చివరి వారంలో రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా నుంచి 26 ప్రదర్శనలతో విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేసిన జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్ రావును సైన్స్ ఉపాధ్యాయులు, 16 కమిటీల సభ్యులను, అభినందించారు. డీసీఈబీ రాజశేఖర్‌రావు, ఏసీ రాజశేఖర్ రావు, నోడల్ అధికారి కురుమయ్య, కార్యాలయ సెక్టోరియల్ అధికారులు వెంకటయ్య, షర్ఫుద్దీన్, నూరుద్దీన్, మురళీధర్ రెడ్డి, శోభారాణి, కార్యాలయ పర్యవేక్షకులు నాగేందర్, వెంకటేశ్వర్లు సైన్స్ ఉపాధ్యాయులు, వివిధ కమిటీల కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రూ.2 కోట్ల మాదకద్రవ్యాలు ధ్వంసం


మాదకద్రవ్యాలను ధ్వంసం చేయడానికి సిద్ధం చేస్తున్న సిబ్బంది

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ పరిధిలో ఈ ఏడాది కాలంలో నమోదైన 24 కేసుల్లో సీజ్ చేసిన ఎండు గంజాయి, గంజాయి మొక్కలు, ఆల్ఫ్రాజోలం, డైజోఫాంలతోపాటు ఇతర మాదకద్రవ్యాలను బర్నింగ్ బాయిలర్ మిషన్‌లో వేసి కాల్చివేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ అధికారులు ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకు 24కేసులు నమోదు చేయగా.. ఇందులో 10 కిలోల ఎండు గంజాయి, 11 గంజాయి మొక్కలు, 16 కిలోల ఆల్ఫ్రాజోలం, 1.5 కిలోల డైజోఫాం, 5 కిలోల యాష్ ఆయిల్‌ను సీజ్ చేశారు. సీజ్ చేసిన గంజాయితోపాటు ఇతర మత్తు పదార్థాలను డ్రగ్ డిస్పోజల్ కమిటీ (డీడీసీ) ధ్వంసం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం సీజ్ చేసిన గంజాయి, ఇతర మత్తు పదార్థాలను రంగారెడ్డి జిల్లాలోని జీజేమల్టిక్లేవ్ ప్రైవేట్ లిమిటెడ్ చెందిన బర్నింగ్ బాయిలర్ మిషన్ వేసి కాల్చివేశారు. కాల్చిన మాదకద్రవ్యాల విలువ రూ.2 కోట్ల ఉంటుంది. కాల్చివేసిన విధానం మొత్తం వీడియో చిత్రీకరించారు. ఎక్సైజ్ శాఖ మహబూబ్‌నగర్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలను ధ్వంసం చేసే విధానం పూర్తిచేశారు. కార్యక్రమంలో ఏఈఎస్‌లు శ్రీనివాస్, నర్సింహారెడ్డి, సీఐలు వీరారెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన ఫలితాలు రైతులకు చేరాలి

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి


పాలెం ఆర్ఏఆర్ఎస్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న చిన్నారెడ్డి, కలెక్టర్, ఏడీఆర్‌లు

బిజినేపల్లి: వ్యవసాయంలో శాస్త్రవేత్తలు అత్యుత్తమ పరిశోధనలు చేసి వాటి ఫలితాలు, లాభాలు రైతులకు చేరువయ్యేలా చూడాలని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి అన్నారు. రైతులు సంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో పాటు మరికొన్ని అధునాతన పద్ధతులు అవలంభించాలన్నారు. శుక్రవారం పాలెం వ్యవసాయ పరిశోధన స్థానంలో పాలెం వ్యవసాయ కళాశాల, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, 5 కృషి విజ్ఞాన కేంద్రాలు 3 ఏరువాక కేంద్రాలు 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ రైతులు అధునాతన పద్ధతుల్ని ఉపయోగించి లాభాలు ఆర్జించాలన్నారు. శాస్త్రవేత్తల, అధికారుల సూచనలు, సలహాలు తీసుకుని అధిక దిగుబడులు సాధించాలన్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ పంటల సాగులో చీడపీడల నివారణకు శాస్త్రవేత్తల, అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. ఆహార పంటలను సెంద్రియ పద్ధతిలో సాగు చేస్తే బహిరంగ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఏడీఆర్ డా. వెంకటయ్య మాట్లాడారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని, తద్వారా పంటకు ఏఏ పోషకాలు అవసరమే గుర్తించి, ఆయా ఎరువులు వేసుకోవడానికి సూచిస్తామన్నారు. పాలెం కేవీకే సమన్వయకర్త డా. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో కూలీల కొరతతో ఇబ్బంది పడుతున్నారని, అందుకు వారు యాంత్రీకరణపై దృష్టి పెట్టాలన్నారు. ఆరుతడి పంటల సాగులో బిందుసేద్యం, తుంపర సేద్యం పాటించాలన్నారు. కార్యక్రమంలో పూర్వ ఏడీఆర్‌లు డా. విష్ణువర్ధన్‌రెడ్డి, డా.వెంకటరమణ, డా.టీ.వీ.కే.సింగ్, శాస్త్రవేత్తలు వాణిశ్రీ, కంప సాగర్, కేవీకే కో ఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

462 గ్రాముల ఆల్ఫాజోలం స్వాధీనం


ఆల్ఫాజోలం పట్టుకున్న అధికారులు

నారాయణపేట: డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ విజయ్‌భాస్కర్ రెడ్డి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహారెడ్డిల ఆదేశానుసారం డీటీఎఫ్, పేట ఎక్సైజ్ శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు చేపట్టి 462 గ్రాముల ఆల్ఫాజోలం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గురువారం మక్తల్ మండలంలోని చందాపూర్ శివారులో ఆల్ఫాజోలం క్రయ, విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో డీటీఎఫ్ సీఐ కవిత, ఎస్ఐ రాజేందర్‌లతో అక్కడికి చేరుకున్నామన్నారు. 462 గ్రాముల ఆల్ఫాజోలం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మస్తిపూర్‌కు చెందిన బోయ సత్యం, చందపూర్‌కు చెందిన ఉసెనప్పగౌడ్‌లపై కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నార్కోటిక్ డ్రగ్స్ క్రయ, విక్రయాలు ఎవరైనా జరిపితే ఎన్‌డీపీఎస్ యాక్ట్ 1985 ప్రకారం కఠిన శిక్షకు గురవుతారని హెచ్చరించారు. ఎవరైనా క్రయ, విక్రయాలు జరిపితే సంబంధిత ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది కృష్ణయ్య, రియాజ్, పాలియా ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

- బైక్ చెట్టుకు ఢీకొని ఒకరు
- ఆర్టీసీ బస్సు కింద పడి మరొకరు..
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

తెలకపల్లి: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో బడంగ్‌పేటకు చెందిన ముగ్గురు స్నేహితులు గురువారం రాత్రి తెలకపల్లి మండలంలోని గోలగుండం గ్రామానికి చింతకుంట్ల ఆంజనేయులు తమ్ముడి పుట్టిన రోజు వేడుకలకు బయలుదేరారు. చింతకుంట్ల ఆంజనేయులు, క్యాసానపల్లి ప్రభుదేవ, అఖిల్ ముగ్గురు స్నేహితులు ద్విచక్రవాహనంపై గోలగుండ గ్రామానికి వెళ్తుండగా, కమ్మరెడ్డిపల్లి గ్రామ సమీపంలో మలుపువద్ద బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రభుదేవ(18) అక్కడికక్కడే మృతి చెందగా, గోలగుండం గ్రామానికి చెందిన అంజనేయులు, అఖిల్‌లకు త్రీ గాయాలయ్యాయి. ప్రభుదేవ తండ్రి గురువయ్య శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు కిందపడి..


కిష్టన్న (ఫైల్)

అయిజ: ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మున్సిపల్ పరిధిలో చోటుచేసుకుంది. ఆర్టీసీ అధికారుల వివరాల ప్రకారం.. అయిజ పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన కిష్టన్న (49) మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా, ఆర్టీసీ బస్సు అయిజ నుంచి గద్వాలకు బయలుదేరింది. ఈక్రమంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌వద్ద బైక్‌ను ఢీకొట్టడంతో కిష్టన్న కాలు విరిగిపోయింది. చికిత్స నిమిత్తం ఆయనను కర్నూల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నుజ్జునుజ్జైన ఎడుమ కాలు తొలగించాల్సి ఉండగా, గుండెపోటుకు గురై కిష్టన్న మృతి చెందాడు. కిష్టన్న అయిజ పట్టణంలో స్పాట్ బిల్లరుగా పనిచేస్తూ జీవనం సాగించాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఆర్టీసీ డ్రైవర్ పెద్దకృష్ణపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏటీఎం ధ్వంసం చేసిన వ్యక్తికి రిమాండ్

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని కేబీఎస్ బ్యాంకు పక్కన ఏటీఎంలో గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఏటీఎంలోకి చొరబడి ధ్వంసం చేసిన సంఘటనలో వ్యక్తిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శివశంకర్ వెల్లడించారు. శుక్రవారం విలేకరులతో సీఐ మాట్లాడుతూ కేబీఎస్ బ్యాంక్ మేనేజర్ పి. బాల వెంకటన్న ఫిర్యాదు మేరకు ఏటీఎం ధ్వంసంపై కేసు నమోదు చేసి నారాయణపేట టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టి రెండు గంటల్లోనే దొంగతనానికి పాల్పడిన నారాయణపేట కురువగేరి తోళ్ల మల్లేష్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఏటీఎం ను ధ్వంసం చేసేందుకు ఉపయోగించిన కొడవలి స్వాధీనం చేసుకున్నారు. ఏటీఎంలో నగదు పోలేదని మేనేజర్ పరిశీలించి తెలిపారు. రెండు గంటల్లోనే దొంగను పట్టుకున్న కేసు ఛేదించిన ఎస్ఐ వెంకటేశ్వర్లును, ఎస్ఐ 2 కృష్ణదేవ్, సిబ్బంది రాము, ఆంజనేయులు, లింగమూర్తిలను నారాయణపేట సీఐ శివశంకర్ అభినందించారు.

ఐదు ఇసుక వాహనాల పట్టివేత



చిన్నచింతకుంట: నారాయణపేట జిల్లా మాగనూర్ మండలం నుంచి ఐదు వాహనాల్లో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా చిన్నచింతకుంట మండలం బండ్రపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం తెల్ల వారుజామున పోలీసులు పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్ శేఖర్ తెలిపారు.